కుక్కలు, కోతుల బెడద నివారిస్తాం

- ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత
- సాక్షి ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో కోతులు, కుక్కల బెడద నివారిస్తామని ఆర్మూర్ చైర్‌పర్సన్ వినీత, భీమ్‌గల్ కమిషనర్ రాజేందర్ అన్నారు. సోమవారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో వారు ప్రజల సమస్యలను విన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కుక్కలు, కోతులు, పందుల సమస్య తీవ్రంగా ఉండటంతో వాటి సమస్యలను అరికట్టేందుకు చర్యలు చేపడుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు. ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుతం సిద్దుల గుట్ట, అరుంధతీనగర్‌లో కోతుల నివారణకు చర్యలు ప్రారంభమయ్యాయని చెప్పారు. పందుల పెంపకందారులకు ఇటీవలే నోటీసులు అందజేశామన్నారు.

■ డ్రెయినేజీలు సరిగా తీయకపోవడంతో వాసన వస్తుంది. – కిరణ్, 36వ వార్డు

✤ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి మురికికాలువను శుభ్రం చేయిస్తాం.

■ పోచమ్మ గల్లీలో మురికికాలువ సరిగా లేక మురుగునీరు రోడ్డుపై పారుతోంది. – గణేష్, పోచమ్మగల్లీ

✤ వార్డు కౌన్సిలర్‌తో మాట్లాడి సమస్య ఎక్కడ ఉందో పరిశీలించి డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతాం.

■ మున్నూర్‌కాపు సంఘం వద్ద పందులు సమస్య తీవ్రంగా ఉంది. – విఠల్

✤ జనావాసాల మధ్య పందులు లేకుండా చేస్తాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

■ కాలనీలో దోమల బెడద తీవ్రంగా ఉంది.
– రామ్‌రాజ్, 35వ వార్డు

✤ కాలనీలో ఫాగింగ్ చేయిస్తాం.

■ తహసీల్ కార్యాలయం ఎదుట మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి గుంతగా మారింది. – దేవర్ష, ఆర్మూర్

✤ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం.

■ రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పాడుతోంది.
– రాజు, పాతబస్టాండ్

✤ రోడ్లపై కూరగాయలు విక్రయించకుండా చూస్తాం.

■ గోల్‌బంగ్లా వద్ద కోతులు, కుక్కలు తీవ్రంగా ఉన్నాయి. రాత్రి సమయంలో కుక్కలు మొరగడంతో నిద్రపట్టడం లేదు.
– హరిప్రసాద్, గోల్‌బంగ్లా

✤ కుక్కల, కోతుల బెడద తీవ్రంగా ఉంది వాస్తవమే. త్వరలో సమస్య పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

■ కాలనీల్లో ఓపెన్ స్థలాలు ఉండటంతో కోతులు, పందులు, కుక్కలు వచ్చి ఉండటంతో పాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. – సాయి, చిన్నబజార్

✤ ఆర్మూర్ పరిధిలో ఎక్కెడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నా వారికి నోటీసులు అందజేసి ఓపెన్ స్థలాలను శుభ్రపర్చుకునే విధంగా చూస్తాం.

■ మా వార్డులో చాలా కోతులు ఉన్నాయి. మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇంట్లో సామగ్రి ఎత్తుకెళ్తున్నాయి. కోతులను అరికట్టాలి.
– అనిత, పెర్కిట్, పోహర్ కిరణ్, 33వవార్డు, కిషన్, చిన్నబజార్

✤ కోతుల నివారణ చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే ఆర్మూర్‌లో కోతులు లేకుండా చూస్తాం.

■ మా కాలనీకి ప్రతిరోజు చెత్తబండి రావడం లేదు. పక్క వీధిలోకి వచ్చే బండిలో చెత్త వేయడం లేదు. – నరేష్, హుస్నాబాద్ కాలనీ

✤ చెత్తట్రాలీలకు మరమ్మతులు చేయిస్తున్నాం. సానిటరీ ఎస్సైతో మాట్లాడి పక్కవీధిలో చెత్తను సేకరించే విధంగా చర్యలు చేపడుతాం.

మాస్ స్టెరిలైజేషన్ చేయిస్తాం



భీమ్‌గల్: భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలో కుక్కలు, పందులు, కోతుల బెడద నివారిస్తామని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ అన్నారు.

■ పట్టణంలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. పిల్లలను కరుస్తున్నాయి. – ప్రదీప్, అయ్యప్పనగర్ కాలనీ

✤ కుక్కలకు మాస్ స్టెరిలైజేషన్ చేసి వాటి సంఖ్య పెరగకుండా చూస్తాం. కుక్కల ద్వారా జరిగే ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు చేపడుతాం.

■ చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి మసీదుకు వెళ్లే గల్లి వరకు డ్రెయినేజీలు శుభ్రంగా లేవు.
– ఫైసల్, భీమ్‌గల్

✤ ఫైర్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయించాను. ఇంక ఎక్కడైనా శుభ్రంగా లేకుండా పరిశీలించి క్లీన్ చేయిస్తాను.

■ కోతుల బెడద ఎక్కువగా ఉంది. పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. – రాజు, నందిగల్లి

✤ కోతుల బెడద ఎక్కువ ఉన్న మాట వాస్తవమే. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. భీమ్‌గల్‌లో ఒకటి, లింబాద్రి గుట్ట వద్ద మరో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసి ప్రత్యేక బృందాల ద్వారా కోతులను పట్టుకొని అక్కడికి తరలిస్తాం.

■ కుప్కల్ వెళ్లే దారిలో ఉన్న డంపింగ్ యార్డుతో ఇబ్బంది పడుతున్నాం.
– రమణ, ఎర్రోడ్‌గల్లి

✤ డంపింగ్ యార్డుకు స్థలం ఇవ్వాలని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారికి ప్రపోజల్ పంపాము. ఆ ప్రక్రియ పూర్తి అవ్వగానే డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పెర్కిట్ : ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు బీఆర్ఎస్‌లో చేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం గ్రామానికి చెందిన గౌడ సంఘాల ముఖ్య నాయకులు ప్రవీణ్ గౌడ్, రవితేజ గౌడ్, వంశీ, మహేందర్, సురేందర్, సుదర్శన్, నర్సాగౌడ్‌తో పాటు వంది మంది పార్టీలో చేరారు. ఆర్మూర్–పిప్రికి డబుల్ రోడ్ నిర్మాణం త్వరలోనే సాకారమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పిప్రి సర్పంచ్ ఆసపురం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్, పీఏసీఎస్ చైర్మన్ హేమంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, చిన్న భోజారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



రెంజల్ : దివ్యాంగులను ప్రతీ ఒక్కరు ఆదరించాలని, వారికి సేవచేయడం మానవ సేవతో సమానమని ఎంఈవో గణేశ్‌రావు అన్నారు. నీలా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గైని శ్రీనివాస్ తండ్రి గంగారాం జ్ఞాపకార్థం సోమవారం సాటాపూర్‌లోని భవిత దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు చైర్లు, బోధనోపకరణాలను అందించారు. ఉపాధ్యాయులు విశ్వనాథ్‌మ హాజన్, స్వప్న, అనిత, షబానా పాల్గొన్నారు.

పెరిగిన కరువు భత్యం చెల్లించాలి



బోధన్ : బీడీ పరిశ్రమ ఉద్యోగులు, బీడీలు కార్మికులకు పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్ 1 నుంచి చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తట్టికోట కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగమణి, సత్యవ్వ, సూర్యకళ, లక్ష్మి, సావిత్రి, మంజుల, లావణ్య పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



బోధన్‌రూరల్ : మండలంలోని గ్రామ సమాఖ్యల సభ్యులు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ ఏపీఎం వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మహిళ సమాఖ్య–1 అధ్యక్షురాలు పద్మవతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏపీఎం వినోద్ కుమార్ చిన్న సంఘాల లైవ్ మీటింగ్‌లు, గ్రేడింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ధనలక్ష్మి, ఖైరున్నీసా, సీసీలు, ఎంఎస్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన

బోధన్‌రూరల్ : గ్రామీణ ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని బోధన్ డిపో మేనజర్ టి.ఎస్ స్వామి అన్నారు. సోమవారం మండలంలోని కల్దుర్కి, రాంపూర్, సిద్దాపూర్, ఖండ్‌గాం గ్రామాల్లో బోధన్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో నిర్వహించారు. ఆర్టీసీ అందిస్తున్న రాయితీలు, బస్ పాస్‌లు, అద్దె బస్సులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

బీడీ కార్మికుల ధర్నా



రుద్రూర్ : మోస్రాలోని దేశాయి బీడీ కార్ఖానా ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం బీడీ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మేనేజర్‌కు అందజేశారు. బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ బీడీ కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యం, టేకిదార్లపై చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. కంపెనీ ఇచ్చిన కొత్త పీఎఫ్ నంబర్లకు టేకేదార్లు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నన్నేసాబ్, సునీత, మంజుల, గంగ, మణిరేణుక, పద్మ, వసంత, నిర్మల, సువర్ణ, విజయ, సావిత్రి పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రూర్: పోతంగల్ విండో పరిధిలోని సోంపూర్‌లో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సర్పంచ్ భాగ్యలక్ష్మి నాగరాజ్ గౌడ్ ప్రారంభించారు. గంగాధర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దర్జాలేని దర్జీల బతుకులు

రుద్రూర్: రుద్రూర్‌కు చెందిన సాయిబాబాకు చిన్నప్పటి నుంచి టైలర్ వృత్తే ఆధారం. గతంలో పని బాగా ఉండేది. పదేళ్ల నుంచి పరిస్థితి దారుణంగా మారింది. వేరే పనులు రావు. పెద్ద రెడిమేట్ కంపెని దగ్గరకు వెళ్లి పీస్ (కూలీ)వర్క్ చేసుకుంటున్నాడు. ఇది సాయిబాబా పరిస్థితి మాత్రమే కాదు. దర్జీ వృత్తిని నమ్ముకుని బతుకు వెళ్లదీస్తున్న అనేక మంది దీనగాథ.. మంగళవారం టైలర్స్ డే సందర్భంగా కథనం..

కులాలకు అతీతంగా దర్జీ వృత్తి (టైలరింగ్)ని జీవనోపాధికి చేసుకుని జీవిస్తున్న టైలర్స్ ఉపాధికి రెడిమెంట్ దుస్తుల రాకతో చిల్లు పడింది. వస్త్ర ప్రపంచంలో చోటు చేసుకున్న మార్పుల ప్రభావం, విదేశీ బ్రాండ్ల వస్త్రాలు ప్రత్యేక డిజైన్‌ల రాకతో దర్జీలు ప్రత్యామ్నాయ పనుల వైపు వెళ్తున్నారు. పట్టుదలతో ఇదే వృత్తిలో కొనసాగేవారికి సరిపడు పని దొరకక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది టైలర్స్ డే రోజు ఉన్నతాధికారులకు తమ డిమాండ్లపై వినతిపత్రాలు అందచేస్తున్నారు. కాని ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు.

చేయూత అందించాలి



దర్జీలకు చేనేత, బీడీ కార్మికులకు ఇచ్చినట్టు జీవన భృతి ఇవ్వాలి. టైలర్ షాపులకు ఉచిత కరెంట్ ఇవ్వాలి. స్కూల్ యూనిఫామ్స్ కుట్టడానికి దర్జీలకే ఇవ్వాలి.

– కొలాస్ గంగాధర్, మేరు సంఘం వర్ని ఉమ్మడి మండల అధ్యక్షుడు

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



ఆర్మూర్‌టౌన్ : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీడబ్ల్యూవో సుధారాణి అన్నారు. పట్టణంలోని జిరాయత్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన పాటించాలని సూచించారు. అంగన్‌వాడీకి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. సీడీపీవో భార్గవి, ఏసీడీపీవో జ్యోతి పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



నందిపేట్: మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో శనివారం ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతి నిర్వహించారు. ప్రజాపంథా జిల్లా అధ్యక్షుడు గంగాధర్, సాయరెడ్డి, శోభా మేడం పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు కిషన్, నరేందర్, దుర్గాప్రసాద్, నిఖిల్, మనోజ్, శీను, వంశీ భోజన్న, నవీన్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



మాక్లూర్: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా మార్చి 1 నుంచి మండలాల వారిగా ప్రదర్శనలు నిర్వహించాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి సవిత అన్నారు. సోమవారం మండలంలోని మదన్‌పల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. స్వరూప, ఒడ్డెమ్మ, సాయమ్మ, నర్సుబాయి, లక్ష్మీ, నందన పాల్గొన్నారు.

కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

బాల్కొండ : పల్లెల్లో వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని మెండోరా మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. సోమవారం ఎంపీపీ సుకన్య అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండ ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సాగుకు వేళాపాల లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ తలారి గంగాధర్, వైస్ ఎంపీపీ సరస్వతి, కోఆప్షన్ సభ్యుడు బాబా, ఎంఈవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లా ఉద్యమానికి సంపూర్ణ మద్దతు



రిలే నిరాహార దీక్షలను విరమింపజేస్తున్న వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తు న్యాయవాదులు చేపట్టిన ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని వైఎస్ఆర్‌టీపీ నియోజక వర్గ కో–ఆర్డినేటర్ గౌతం ప్రసాద్ అన్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 71వ రోజుకు చేరాయి. దీక్షలో వైఎస్ఆర్‌టీపీ నియోజక వర్గ కో–ఆర్డినేటర్ నింబూరి గౌతం ప్రసాద్, నాయకులు, సభ్యులు జగన్‌గౌడ్, సంగమేశ్వర్, తోట సుధాకర్, పోశయ్య, అశోక్, స్వప్న, ప్రభాకర్, అబ్బులు, రాంసింగ్, మాణిక్యం, శంకర్, రాము, రాంచందర్, అవినాష్, రమేష్, అర్జున్ గౌడ్, శ్రీశైలం గౌడ్ కూర్చున్నారు. వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి నిమ్మరసం ఇచ్చి రిలే దీక్షలను విరమింపజేశారు.

ఘనంగా జైతాపూర్ రామాలయ వార్షికోత్సవం



ఎడపల్లి: మండలంలోని జైతాపూర్ రామలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీ సేవ, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మిరాంగోపాల్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



జాన్కంపేట్‌లో శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

వేల్పూర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్ పేర్కొన్నారు. మండలంలోని జాన్కంపేట్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ సాడ ప్రేమలత, ఉపసర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ సాడ చందన్, డాక్టర్ శరత్‌చంద్ర, సూపర్‌వైజర్ నాగమణి, ఆప్తమాలజిస్ట్ స్మరణ, జీపీ కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని మౌలాలితండాలో సోమవారం సర్పంచ్ జాదవ్ సునిత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. రైతు సమన్వయ సమితి జిల్లా డైరెక్టర్ మౌలానా, ఆరోగ్య విస్తరణ అధికారులు రవీందర్, శ్రావణ్‌కుమార్, డాక్టర్ ప్రమోదిత, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ భవన్‌లో..

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని లయన్స్ భవన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ అధ్యక్షుడు చెన్న రవికుమార్, పద్మ నర్సయ్య, కృష్ణ పండిత్, రత్నం, పవన్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



కమలాపూర్‌లో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నవీపేట : బీజేపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా నాయకుడు వడ్డి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కమలాపూర్, నారాయణ్‌పూర్ గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ పేరుతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, బీజేవైఎం నాయకులు పిల్లి శ్రీకాంత్, నాశేశ్వర్ సర్పంచ్ సరిన్, నవీపేట ఎంపీటీసీ మైసరాధ, వంశీ, ఆనంద్, రామకృష్ణ, భూషణ్, చిన్నుబాయి, నాగేశ్వర్‌రావ్, రచ్చ సుదర్శన్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



బోధన్ ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థులు



నవీపేటలో కొవ్వొత్తులతో నివాళి..

బోధన్ : వరంగల్ మెడికల్ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలో ర్యాలీ, రైల్వే గేట్ వద్ద రాస్తారోకో చేపట్టారు. అనంతరం ర్యాలీగా ఆర్డీవో ఆఫీసు వరకు వెళ్లి ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. జాదవ్ ప్రవీణ్ నాయక్, బానోత్ విష్ణు, శ్రీనివాస్, సాయికుమార్, బాబు నాయక్, రవికుమార్, పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్/నవీపేట: వైద్య విద్యార్థి ప్రీతికి ఆర్మూర్, నవీపేటలో బీజేపీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. జెస్సు అనిల్, పోల్కం వేణు, భూపేందర్, ద్యాగ ఉదయ్, విజయ్, పులి యుగందర్, మురళీధర్ పాల్గొన్నారు.

బోధన్: ప్రీతి మృతి ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో టీజీవీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు.

బోధన్‌టౌన్: ప్రీతి మృతికి నిరసనగా హిందు వాహిని ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పులి సాయిలు, సుంకు శేఖర్, సలిగింజ రాజు, రాజేందర్, సాయిలు, దినేష్, వెంకట్ ఉన్నారు.

కౌలు రైతుల ఆందోళన



రుద్రూర్: పోతంగల్ విండో పరిధిలోని హెగ్డోలి బ్రాంచ్ కార్యాలయం వద్ద సోమవారం కౌలు రైతులు ఆందోళన చేశారు. పంట పండించిన కౌలు రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. శనగ కొనుగోలు కేంద్రంలో ఎకరానికి 6 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన ఉత్పత్తులు ఎక్కడ విక్రయించాలని ప్రశ్నించారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పుప్పాల శంకర్ వచ్చి సమస్యలను ఫోన్ ద్వారా జిల్లా వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లారు.

సంక్షిప్తం

అంతర్గత మార్కుల తనిఖీ

మోర్తాడ్: మండలంలోని ధర్మోరా ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల తనిఖీని దొన్కల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మహేష్, రాజనారాయణలు సోమవారం నిర్వహించారు.

వర్షపు నీటిని సంరక్షించుకోవాలి

మోర్తాడ్: వర్షపు నీటిని వృథాగా పోకుండా సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ సూచించారు. సోమవారం తొర్తిలో భూగర్భ జల సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పెర్కిట్: గర్భిణులు ప్రతినెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యురాలు మానస సూచించారు. గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు.

బోధన్‌లో 'ఇంటింటికీ టీడీపీ'

బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలో సోమవారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కిట్లను పంపిణీ చేశారు. దేగాం యాదాగౌడ్, వెంకటేశ్వర్‌రావు, హన్మంత్‌రావు, గోపాల్ రెడ్డి, శ్రీరాంమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

పెర్కిట్: ఆర్మూర్ మండలంలోని మగ్గిడి పాఠశాలలో మన ఊరు– మనబడి పనులను సోమవారం సర్పంచ్ సుమలత నర్సయ్య, ఎంపీడివో శ్రీనివాస్ పరిశీలించారు. పనులను త్వరితగతంగా పూర్తిచేయాలన్నారు.

మందర్నలో ఎంపీడీవో పర్యటన

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మందర్న పంచాయతీలో ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం పర్యటించారు. మన ఊరు మన బడి, నర్సరీ పనులను పరిశీలించారు. సర్పంచ్ గంగారాం ఉన్నారు.

ఈపీఎఫ్‌వో దరఖాస్తుపై అవగాహన

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'నిధి ఆప్‌కే నికత్ 2.0' కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజనల్ కమిషనర్ హనుమంతప్ప, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్ రావు, శ్రావణ్ పీఎఫ్ చందదారులు, పించను దారులకు ఈపీఎఫ్ సంస్థలో ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

భీమ్‌గల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మొయిజ్, శర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'హాథ్ సే హాథ్ జోడో' కార్యక్రమం

రుద్రూర్(కోటగిరి): కోటగిరి మండలం యాద్గార్‌పూర్, పోతంగల్ మండలం హంగర్గా ఫారం, తిర్మలాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సోమవారం 'హాథ్ సే హాథ్ జోడో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా యలమంచిలి శ్రీనివాస్‌రావ్, డా కూనీపూర్ రాజారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వహీద్, కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాక్లూర్ : మండలంలోని మదన్‌పల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం పనులను సోమవారం సర్పంచ్ శంకర్‌గౌడ్ ప్రారంభించారు. ఎంపీటీసీ ఒడ్డెన్న, ఉపసర్పంచ్ మహేష్ పాల్గొన్నారు.